# ఐటీఐ కళాశాల ప్రారంభమెప్పుడో !



ఐటీఐ కళాశాల కోసం ఇచ్చిన స్కిల్ డెవలప్‌మెంట్ భవనం

## రూ. మూడు కోట్లు నిధులు మంజూరైనా పెండింగ్‌లోనే ఫైల్

తాండూరు రూరల్, డిసెంబర్ 18 : ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏర్పాటు కోసం విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. భవనం ఉంది, కానీ విద్యార్థులు లేరు. ఐటీఐ కళాశాలలో ప్రిన్సిపాల్‌తో పాటు మరో ముగ్గురు సిబ్బంది ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహిస్తున్నారు. కళాశాలలో ఎలాంటి కార్యకలాపాలు లేక సిబ్బంది బోరుమంటున్నారు. గత ఏడాది తాండూరు మండలం, జినుగుర్తి గ్రామ సమీపంలోని స్కిల్ డెవలప్‌మెంట్ భవనాన్ని ఐటీఐ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కళాశాల కొనసాగాలంటే టూల్స్, ఎక్విప్‌మెంట్స్ అవసరం. వీటి కోసం ప్రభుత్వం రూ.మూడు కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులు కమిషనరేట్ పరిధిలో పెం డింగ్‌లో ఉన్నాయి. టూల్స్,ఎక్విప్‌మెంట్స్ కొనుగోలు కోసం ప్రభుత్వం నుంచి టెండర్ కాల్ ఫర్ చేయాల్సి ఉంది. దీనికి సంబంధించిన ఫైల్ ఉన్నతాధికారుల వద్ద పెండింగ్‌లో ఉంది. ఐటీఐ కళాశాలలో నాలుగు ట్రేడ్స్‌లో శిక్షణ పొందే అవకాశం ఉంది. ఎలక్ట్రికల్, ఫిట్టర్, కోపా, వెల్డర్ ట్రేడ్స్‌లో విద్యార్థులు శిక్షణ పొందే అవకాశం ఉంది. ఎలక్ట్రికల్‌లో 80 సీట్లు, ఫిట్టర్‌లో 80, కోపాలో 40, వెల్డర్‌లో 40 సీట్లు ఉంటాయి. ఈ ట్రేడ్స్ కొన సాగాలంటే టూల్స్, ఎక్విప్‌మెంట్ అవసరం. వీటికే టెండర్లు పిలవాలి. ఇప్పటి వీటిని ఏర్పాటు చేసి ఉంటే, 2024, జనవరి, ఫిబ్రవరిలో సెంట్రల్ కమిటీ వచ్చి కళాశాలలో ఏర్పాటు చేసిన టూల్స్, ఎక్విప్‌మెంట్స్ పరిశీలించి, అనుమతులు ఇచ్చే అవకాశం ఉం డేది. అనంతరం నోటిఫికేషన్ జారీ చేసి, ఆన్‌లైన్‌లో విద్యార్థులు ట్రేడ్స్ కోసం దరఖాస్తు చేసుకునే అవకావశం ఏర్పడేది. మే నెలలో అడ్మిషన్లు ప్రారంభం అయ్యే అవకాశం ఉండేది. కానీ జిల్లా ఉపాధి కల్పన శిక్షణ అధికారులు తాండూరు ఐటీఐ కళాశాల ఏర్పాటు పై ఇప్పటి వరకు దృష్టి సారించక పోవడం గమనార్హం. ప్రభుత్వం ఐటీఐ కళాశాల ఏర్పాటు చేసేందుకు ఉపక్రమించాలని విద్యార్థులు కోరుతున్నారు.

### 20 మంది సిబ్బంది అవసరం

తాండూరు ఐటీఐ కళాశాల కొనసాగాలంటే టీచింగ్, నాన్‌టీచింగ్ మొత్తం 20 మంది సిబ్బంది అవసరం. ప్రస్తుతం నలుగురు సిబ్బంది మాత్రమే ఉన్నారు. ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్‌తోపాటు ఇద్దరు అసిస్టెంట్లు ఉన్నారు. అందులో ఒకరు కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్నారు. మిగతా సిబ్బంది రోజు వచ్చి హాజరు వేసి వెళుతున్నారు.

### ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం : ప్రిన్సిపాల్

ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏర్పాటు చేసే విషయాన్ని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని ప్రిన్సిపాల్ రామానుజ తెలిపారు. కలిసి అన్ని విషయాలు వివరిస్తామన్నారు. ఐటీఐ కళాశాల ఏర్పాటుకు యత్నిస్తామని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు

## మంత్రి కొండా సురేఖకు జ్ఞాపిక బహూకరణ



వికారాబాద్, డిసెంబర్ 18 : అనంతపద్మనాభస్వామి దేవాలయ అర్చకులు సోమవారం రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖల మంత్రి కొండా సురేఖను కలిశారు. ఈ సందర్భంగా వేద మంత్రాలతో ఆశీర్వదించి జ్ఞాపికను అందజేశారు. త్వరలోనే అనంతపద్మనాభస్వామిని దర్శించుకుంటానని మంత్రి తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో అనంతపద్మనాభ స్వామి దేవాలయ చైర్మన్ పద్మనాభం, ఈవో నరేందర్ ఉన్నారు.

## ఎంపీ, సర్పంచ్‌ల ఎన్నికలకు సన్నద్ధం కావాలి



ఎమ్మెల్యే యాదయ్యను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

నవాబుపేట,డిసెంబర్18: బీఆర్ఎస్ మండల యూత్ ప్రెసిడెంట్ రాజశేఖర్ రెడ్డి ఎమ్మెల్యే యాదయ్యను సోమవారం కలిసి పార్టీ బలోపేతంపై చర్చించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తన గెలుపులో భాగమైన బీఆర్ఎస్ మండల నాయకులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే ఎంపీ, సర్పంచుల ఎన్నికలకు సన్నద్ధంగా ఉండాలని వాటిల్లో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు. మండలంలో కార్యకర్తలను కాపాడు కోవడం లో జాగ్రత్త పడాలని ఎమ్మెల్యే గుర్తుజేశారు.

## కారు బోల్తా.. ఎనిమిది మందికి గాయాలు

పెద్దేముల్, డిసెంబర్ 18: కారు బోల్తా కొట్టి ఎనిమిది మందికి తీవ్ర గాయా లై ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్న ఘటన సోమవారం పెద్దేముల్ పోలీసు స్టేషన్ పరిధిలోని కందనెల్లి గ్రామం దగ్గర చోటు చేసుకుంది.ఎస్ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్ పట్టణం గండిపేట్‌కు చెందిన ఎనిమిది మంది యువకులు ఓ కారులో తాండూరులో జరిగే ఓ వివాహానికి హాజరయ్యేందుకు వస్తుండగా కందనెల్లి గ్రామం దగ్గర అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో మొత్తం ఎనిమిది మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఇందులో ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానాకు తరలించినట్టు తెలిపారు.

## కోర్టు ఆదేశాలతో గ్రామ పంచాయతీకి ట్రాక్టర్

పెద్దేముల్, డిసెంబర్ 18 : కోర్టు ఆదేశాలమేరకు రెండు సంవత్సరాల తరువాత మండల పరిధిలోని రుక్మాపూర్ గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను పోలీసుస్టేషన్ నుంచి పంపించినట్లు పెద్దేముల్ ఎస్ఐ ఎం.కాశీనాథ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని రుక్మాపూర్ గ్రామపంచాయతీకి సంబంధించిన ట్రాక్టర్ ను 8, నవంబర్ 2021 సంవత్సరం లో అక్రమంగా ఇసుకను తరలించిన కేసులో అప్పట్లో పెద్దేముల్‌లో ఇన్‌చార్జి ఎస్ఐగా విధు లు నిర్వహిస్తున్న ఎస్ఐ విశ్వజిత్ పట్టుకొని పోలీసు స్టేషన్‌కు తరలించి కేసే నమోదు చేశారు. దాదాపు రెండు సంవత్సరాల పాటు పోలీసు స్టేషన్‌లోనే ట్రాక్టర్ ఉండి పోయింది. తదుపరి స్థానిక ఎస్ఐ ఎం.కాశీనాథ్ సూచనతో కోర్టును ఆశ్రయించి దరఖాస్తు పెట్టుకోవడంతో ట్రాక్టర్‌ను విడుదల చేయాలని ఆదే శాలు రావడంతో సోమవారం రుక్మాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి పరమేశ్‌కు చట్టరీత్యా నియమ నిబంధనలు పాటిస్తూ ట్రాక్టర్‌ను అందజేశారు.

## రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

పెద్దేముల్, డిసెంబర్ 18: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు పెద్దేముల్ ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన బోయిని సిద్ధు, బోయిని మల్లేశ్ అనే ఇద్దరు వ్యక్తులు రెండు ట్రాక్టర్లలో ఇసు కను రుక్మా పూర్ వాగు నుంచి ఖానాపూర్ గ్రామం వైపునకు తరలిస్తుండగా పట్టు కున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## ఓటరుగా నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా అదనపు ఎన్నికల అధికారి లింగ్యానాయక్

వికారాబాద్, డిసెంబర్ 18 : 2024 జనవరి 1 నాటికి 18 ఏండ్లు పూర్తి చేసుకోనున్న వారందరూ ఓటరు జాబితాలో తప్పనిసరిగా పేరు నమోదు చేసుకునేలా చూడాలని జిల్లా అదనపు ఎన్నికల అధికారి లింగ్యా నాయక్ సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలింగ్ బూత్‌ల వారిగా విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిం చాలన్నారు. జనవరి 6వ తేదీన డ్రాఫ్ట్ పబ్లికేషన్ విడుదల చేస్తామని, ఏమైనా ఆక్షేపణలు ఉంటే జనవరి 22వ తేదీ వరకు తెలియజేయాలన్నారు. వచ్చిన ఆక్షేపణలను స్వీకరించి ఫిబ్రవరి 2 వరకు పరిశీలన పూర్తి చేసిన అనంతరం తుది ఓటర్ జాబితాను ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో తాండూరు ఆర్డీవో శ్రీనివాసరావు, ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు

## వికారాబాద్ పట్టణ అభివృద్ధే లక్ష్యం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్, డిసెంబర్ 18 : వికారాబాద్ పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి అహర్నిశలు కృషి చేస్తామని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్, స్థానిక శాసనసభ్యుడు గడ్డం ప్రసాద్ కుమార్ సహకారంతో పట్టణ అభివృద్ధి లక్ష్యంగా ముందుకెళ్తామని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజులా రమేశ్ అన్నారు. సోమవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు, 15వ వార్డులో 15వ ఆర్థిక సంఘం నిధులతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా వార్డులలో 15వ ఆర్థిక సంఘం నిధులతో వాటర్ పైప్ లైన్ పనులు, యూజీడీ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేశ్ కుమార్, స్థానిక కౌన్సిలర్ అనంత్ రెడ్డి, నాయకులు మాలే లక్ష్మణ్, దన్నారం కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## బడిబయటి పిల్లల సర్వే

బొంరాస్‌పేట, డిసెంబర్ 18 : యంగ్ లైఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలో బడి బయటి పిల్లల సర్వే కొనసాగుతున్నది. సంస్థ ప్రతినిధులు మాధవీలత, రాజేశ్, ఉదయ్ కుమార్ సోమవారం మండలంలోని మదన్‌పల్లి తండాలో పర్యటించి ఇంటింటికీ తిరిగి బడి బయటి పిల్లల సర్వే నిర్వహించారు. బడి మానేసి బడిబయట ఉన్న తండాకు చెందిన ఆకాశ్, రాధిక, సుప్రియలను గుర్తించి బడి ఎందుకు మానేశారు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి చదువు యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తండా సర్పంచ్ దేవ్లీబాయి, హెచ్ఎం శ్రీనివాస్, సీఆర్‌పీ సోమ్లా, తండా యువకులు పాల్గొన్నారు

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

ధారూరు, డిసెంబర్ 18: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన ధారూరు పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధారూరు మండలం కుమ్మరిపల్లి గ్రామా నికి చెందిన గాజుల వెంకటయ్య(45) శనివారం మధ్యాహ్నం నాగారం చెరువుకు చేపల వేటకు వెళ్లి తిరిగి రాలేదు. నాగారం చెరువు ప్రాంతంలో ఆయన ధరించిన బట్టలు, సెల్‌ఫోన్ ఉన్నాయి. చెరువులో గాలింపు చర్యలు చేపటడంతో వెంకటయ్య మృత దేహం లభ్యమైందని తెలిపారు. వెంకటయ్య మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## గ్యాస్ కోసం.. ఈ-కేవైసీకి కటాఫ్ తేదీ ఏమీ లేదు

దోమ, డిసెంబర్ 18: గ్యాస్ కోసం ఈ-కేవైసీకి కటాఫ్ టైమ్ ఏమీ లేదని దోమ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని హెచ్‌పీ గ్యాస్ కనెక్షన్ కార్యాలయం ముందు సోమవారం ఈ -కేవైసీ చేసుకునేందుకు మహిళలు పెద్ద మొత్తంలో బారులు తీరారు. వంట గ్యాస్‌ను సబ్సిడీ రాయితీతో రూ. 500లకే అందజేయడానికి కేంద్ర ప్రభుత్వ గ్యాస్ అథారిటీ వారు ఈ-కేవైసీ చేసుకోవాలనే గైడ్‌లైన్స్ వచ్చిన సంద ర్భంగా తీసుకుంటున్నామని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. అయితే ఈ-కేవైసీకి కటాఫ్ టైమ్ ఏమీ లేదు ఎప్పుడైనా చేసుకోవచ్చనే విషయాన్ని వినియోగదారులకు చెప్పినప్పటికీ ప్రతి రోజు భారీగా గ్యాస్ కార్యాలయానికి వస్తున్నారని తెలిపారు.

## ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్, డిసెంబర్ 18: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో 138 ఫిర్యాదులను జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీలైనంత తొందరగా సమస్యలు పరిష్కరించి, లబ్ధిదారులకు న్యాయం చేయాలని తెలిపారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోకుండా, పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

## విద్యుత్ అధికారులు స్పందించాలి

పెద్దేముల్, డిసెంబర్ 18 : మండల కేంద్రంలోని తింసాన్‌పల్లి రోడ్డు మార్గంలో పెద్దేముల్ గ్రామ పంచాయతీ వాటర్ సప్లై మోటార్లు రెండు ఉన్నాయి. ఇటీవల రోడ్డు వేయడంతో ఓ మోటారుకు ఉన్న కరెంట్ సరఫరా స్తంభం పూర్తిగా గుంత లోకి పోయింది. దీంతో ఆరోడ్డు మార్గంలో ప్రతి రోజు రాకపోకలు జరిపే లారీలు ప్రతిసారి విద్యుత్ వైర్లను తగలడంతో వైర్లు తెగిపోతున్నాయి.వైర్లు తెగిపోయి విద్యుత్ సరఫరా ఆగిపోయి గ్రామ పంచాయతీ పరిధిలోని ఆయా కాలనీలకు నీరు రాక పోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. రిపేరు కొరకు పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫోన్ స్పందించడంలేదు.దీంతో ఎల్సీ తీసుకొని మరమ్మతులు చేసుకుంటు న్నట్లు గ్రామ పంచాయతీ సిబ్బంది తెలిపారు.

## బాధితుడికి ఆర్థిక సహాయం

కులకచర్ల, డిసెంబర్ 18 : మండల పరిధిలోని హస్యానాయక్‌తండాలో అనారోగ్యంతో బాధపడుతున్న విస్లావత్ భీమ్లనాయక్‌కు అఖిలభారత బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రాహుల్‌నాయక్ రూ. ఐదు వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఏబీబీఎస్ నాయకులు పాల్గొన్నారు.